తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
గురువారం
22 అక్టోబర్ 2026
పేజీలు : 08



Follow :

# గొప్పలకు పోయి అప్పుల పాలు

## నాయకులు కాగానే లగ్జరీ కార్లు!




### హోదా కోసం ఆర్భాటం.. పోటీ పడి ఖర్చులు.. చివరకు ఆర్థిక భారంతో సతమతం

*నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనే ఆలోచన.. సమాజంలో తమకంటూ ఓ గుర్తింపు ఉండాలనే తాపత్రయం.. మరో నాయకుడికి తామేమీ తక్కువ కాదని నిరూపించుకోవాలనే పోటీ.. వెరసి కొందరు నాయకులు తమ ఆర్థిక స్థోమతకు మించి ఖర్చులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. ముఖ్యంగా రాజకీయంగా, సామాజికంగా నాయకులుగా ఎదిగిన కొందరు ఖరీదైన కార్ల కొనుగోలుతో పాటు పండుగలు, ఉత్సవాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణ కోసం భారీగా ఖర్చు చేస్తూ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.*

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 21, (జనంసాక్షి)

### నాయకులుగా ఎదగగానే లగ్జరీ కార్ల మోజు!

ఇటీవల కొందరు నాయకులు తమ స్థాయికి మించి సుమారు రూ.20 లక్షలు, అంతకంటే ఎక్కువ ధర కలిగిన లగ్జరీ కార్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత అవసరాలకు కారు కొనుగోలు చేయడంలో తప్పులేదు. అయితే తమ ఆదాయానికి, ఆర్థిక పరిస్థితులకు సరిపడే వాహనాన్ని ఎంచుకోవడం కంటే ఇతరులకు గొప్పగా కనిపించాలనే ఉద్దేశంతో ఖరీదైన కార్ల వైపు మొగ్గుచూపడం సమస్యలకు దారితీస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఒక నాయకుడు ఖరీదైన కారు కొనుగోలు చేస్తే, అతనికి పోటీగా మరో నాయకుడు కూడా అంతకంటే తక్కువ కాకూడదనే భావనతో మరో కారు కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. ఇలా ఒకరితో మరొకరు పోటీ పడుతూ తమ హోదాను ప్రదర్శించుకోవాలనే ప్రయత్నంలో కొందరు తమ ఆర్థిక సామర్థ్యాన్ని పక్కనపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఈఎంఐల భారం.. నెలనెలా ఆర్థిక ఇబ్బందులు

లక్షల రూపాయల విలువైన కార్లను కొనుగోలు చేసేందుకు చాలామంది రుణాలపై ఆధారపడాల్సి వస్తుంది. కారు కొనుగోలు చేసిన తర్వాత నెలవారీ వాయిదాలు, ఇంధన ఖర్చులు, బీమా, సర్వీసింగ్, ఇతర నిర్వహణ వ్యయాలు అదనపు భారంగా మారుతాయి. మొదట్లో హోదా, గౌరవం కోసం తీసుకున్న నిర్ణయం.. కాలక్రమంలో కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నాయకుడిగా ప్రజల్లో తిరగడం, కార్యక్రమాలకు హాజరుకావడం అవసరమే అయినప్పటికీ, అందుకోసం చేసే ఖర్చులు ఆదాయానికి మించి ఉంటే ఆర్థిక ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రుణాల వాయిదాలు చెల్లించేందుకు ఇబ్బందులు ఎదురైతే కొత్త అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో ఒక అప్పు తీర్చేందుకు మరో అప్పు చేయాల్సిన దుస్థితి తలెత్తే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

### నాయకుడి వెంట అనుచరులు.. అదనపు ఖర్చుల భారం

నాయకులు కేవలం తమ వ్యక్తిగత అవసరాలకే కాకుండా, తమ వెంట తిరిగే అనుచరులు, సహచరుల కోసం కూడా ఖర్చు చేయాల్సి వస్తోందని కొందరు పేర్కొంటున్నారు. వివిధ కార్యక్రమాలకు వెళ్లడం, సమావేశాలకు హాజరుకావడం, ఇతర ప్రాంతాలకు ప్రయాణించడం వంటి సందర్భాల్లో వాహనాలు, ఇంధనం, భోజనాలు తదితర ఖర్చులు పెరుగుతున్నాయి. ఒక్కో వ్యక్తికి సుమారు రూ.1,000 వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తే, అనుచరుల సంఖ్య పెరిగే కొద్దీ మొత్తం వ్యయం కూడా గణనీయంగా పెరుగుతుంది. ఒక కార్యక్రమానికి పరిమితంగా కనిపించే ఖర్చు.. నెలంతా జరిగే కార్యక్రమాలను కలిపి చూస్తే వేల నుంచి లక్షల రూపాయల వరకు చేరే అవకాశం ఉంది. ప్రజల్లో గుర్తింపు కోసం చేసే ఈ ఖర్చులను భరించలేని పరిస్థితి ఏర్పడితే నాయకులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి



### పండుగలు, ఉత్సవాల పేరుతో అదనపు భారం

వినాయక చవితి, దసరా, బతుకమ్మ, అమ్మవారి ఉత్సవాలు వంటి పండుగలు నాయకులకు సామాజికంగా ప్రజలకు దగ్గరవడానికి అవకాశంగా మారుతున్నాయి. అయితే అదే సమయంలో కొందరికి ఇవి ఆర్థిక భారాన్ని కూడా పెంచుతున్నాయని చర్చ జరుగుతోంది. తమ పరిధిలోని వివిధ మండపాల నిర్వాహకులు నాయకులను సంప్రదించి విగ్రహాల ఏర్పాటు, మండపాల నిర్వహణ, అలంకరణలు, అన్నదాన కార్యక్రమాలు, ఇతర ఏర్పాట్లకు సహాయం కోరుతుంటారు. ఒకరు వినాయక విగ్రహం ఏర్పాటు చేయాలని కోరితే, మరొకరు మండపం పూర్తి చేయాలని, ఇంకొకరు అన్నదానానికి సహకరించాలని అడుగుతారు. ఇలా ఒక్కో నిర్వాహకుడి నుంచి వచ్చే అభ్యర్థనలను కాదనలేక కొందరు నాయకులు తమ స్థాయికి మించి ఆర్థిక సహాయం చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఒకటి రెండు కార్యక్రమాలకు సహాయం చేయడం పెద్ద సమస్య కాకపోయినా, ఒకేసారి మూడు నుంచి ఐదు మండపాలు లేదా ఉత్సవాల నిర్వహణకు సహకరించాల్సి వస్తే ఖర్చులు పెరుగుతాయి. కొందరు నాయకుల అంచనా ప్రకారం, వినాయక చవితి, దసరా, అమ్మవారి ఉత్సవాలు వంటి సందర్భాల్లో వివిధ కార్యక్రమాలకు కలిపి ఒక్కో నాయకుడికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యే పరిస్థితులు ఉంటున్నాయి. అయితే ఈ మొత్తం ప్రతి నాయకుడికి ఒకేలా ఉండదు. వారి పరిధి, కార్యక్రమాల సంఖ్య, అందించే సహాయం ఆధారంగా వ్యయం మారుతుంది.

### సహాయం చేయాలనే మనసు.. స్థోమతకు మించిన ఖర్చు

ప్రజలతో కలిసి ఉండటం, పండుగల్లో భాగస్వాములు కావడం, అవసరమైన వారికి సహాయం చేయడం నాయకుల సామాజిక బాధ్యతలో భాగమే. అయితే ప్రతి ఒక్కరి అభ్యర్థనకు ఆర్థిక సహాయం అందించాలనే ఒత్తిడితో తమ ఆదాయాన్ని మించి ఖర్చు చేయడం సరైన నిర్ణయం కాదని పలువురు సూచిస్తున్నారు. ఒకసారి సహాయం చేసిన చోట మరోసారి కూడా సహాయం చేయాలనే ఆశిస్తారు. ఒక మండపానికి ఇచ్చిన సహాయాన్ని చూసి మరో మండపం నిర్వాహకులు కూడా తమకు సహకరించాలని కోరవచ్చు. దీంతో ఎవరికీ కాదనలేని పరిస్థితిలో కొందరు నాయకులు అప్పులు చేసి మరీ ఖర్చులు భరిస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి.. నాయకులుగా ఎదగడం అంటే ఆర్థికంగా ఆడంబరాలు ప్రదర్శించడం కాదు.. ప్రజలకు ఉపయోగపడేలా వ్యవహరించడం. గొప్పగా కనిపించాలనే ఆరాటంతో స్థోమతకు మించి ఖర్చు చేస్తే, నేడు సమాజంలో హోదా పెరిగినట్లు కనిపించినా రేపు అప్పుల భారం పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఆర్భాటం కంటే ఆర్థిక క్రమశిక్షణకు, ప్రదర్శన కంటే ప్రజాసేవకు ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఘనంగా సత్యశోధక్ పాఠశాల 2012-13

# ఎస్.ఎస్.సి. బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పాఠశాల విద్య, క్రమశిక్షణ, విలువలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు**

**పాఠశాల యూనిఫాం విడిచినా, గురు-శిష్యుల అనుబంధం ఎప్పటికీ చెరిగిపోదు**

**ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య**



**సిరికొండ అక్టోబర్ 21 (జనం సాక్షి ):** సత్యశోధక్ పాఠశాలలో 2012-13 విద్యా సంవత్సరంలో పదో తరగతి (ఎస్.ఎస్.సి.) పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం సిరికొండలోని ఎం.ఎన్. ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించి, వారి సమక్షంలో వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. సుమారు 13 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, పాత స్నేహాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. విద్యార్థి దశలో కలిసి చదువుకున్న మిత్రులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి, తమ జీవిత ప్రయాణంలోని అనుభవాలను పరస్పరం పంచుకోవడం ఈ సమ్మేళనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, 2012-13 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులను ఇన్ని సంవత్సరాల తర్వాత తిరిగి కలుసుకోవడం ఎంతో ఆనందంగా, మరపురాని అనుభూతిగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో నేర్చుకున్న విద్య, క్రమశిక్షణ, విలువలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులని అన్నారు. పాఠశాల యూనిఫాం విడిచిపెట్టి, జీవితంలో ఒక్కొక్కరు ఒక్కో రంగంలో ఎదిగినా, పాఠశాలతో, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధం మాత్రం ఎప్పటికీ చెరిగిపోదని భావోద్వేగంగా వివరించారు. పాఠశాల జీవితంలోని స్నేహాలు, ఆత్మీయతలు, మధుర స్మృతులు జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. 13 ఏళ్ల జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాలు, విజయాలు, కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకోవడం ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాలు మరింత బలపడతాయని, పాఠశాల దశలో ఏర్పడే స్వార్థరహిత స్నేహం ఎంతో విలువైనదని, అలాంటి అనుబంధాలను జీవితాంతం కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్యతో పాటు పదో తరగతి బోధించిన ఉపాధ్యాయులు గంగారెడ్డి, సంతోష్ రెడ్డి, లింగం, నరేందర్, మైఖేల్, ప్రసాద్, అరుణ, సుజాతలను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు సైతం తమ పూర్వ విద్యార్థులను తిరిగి కలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, వారంతా జీవితంలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గురు-శిష్యుల అనుబంధానికి, పాత స్నేహాల మాధుర్యానికి, పాఠశాల జీవితంలోని చెరగని జ్ఞాపకాలకు ప్రతీకగా ఈ ఆత్మీయ సమ్మేళనం నిలిచింది. కాలం గడిచినా, జీవితంలో ఎన్ని మార్పులు వచ్చినా పాఠశాల జ్ఞాపకాలు, గురువుల ఆశీస్సులు, స్నేహితుల ఆత్మీయత ఎప్పటికీ చెరిగిపోవని ఈ సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది.

# అశోక విజయదశమి ఉత్సవాలు

**ఘనంగా అహింస, ప్రేమతోనే విజయాన్ని సాధించాలి**

**కామారెడ్డిలో ఘనంగా 2570వ అశోక విజయదశమి ఉత్సవాలు**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21( జనం సాక్షి)** అహింస, శాంతి, ప్రేమ మార్గంలో సమాజాన్ని ముందుకు నడిపించడమే సామ్రాట్ అశోకుడి ఆశయమని అంబేద్కర్ యువజన సంఘం, బంసెఫ్ , బహుజన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం 2570వ అశోక విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం మరియు బహుజన, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సామ్రాట్ అశోకుడు, గౌతమ బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశోక విజయదశమి విశిష్టతను నాయకులు వివరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల బాబు మాట్లాడుతూ.. కళింగ యుద్ధం అనంతరం అశోక చక్రవర్తిలో వచ్చిన పరివర్తన మానవాళికి గొప్ప సందేశమన్నారు. యుద్ధం ద్వారా కాకుండా అహింస, ప్రేమ, శాంతి మార్గాల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చనే బౌద్ధ బోధనలతో అశోకుడు ప్రభావితమయ్యారని తెలిపారు. అనంతరం ఆయుధాలను విడిచిపెట్టి శాంతి, ధర్మం, మానవతా విలువలకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమిని జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రతి మనిషి మరో మనిషిని ప్రేమతో పలకరించుకుంటూ, సోదరభావంతో విజయదశమి వేడుకలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అశోకుడు, గౌతమ బుద్ధుడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ పరికి ప్రేమ్‌కుమార్, కొత్తపల్లి మల్లన్న, క్యాతం సిద్ధరాములు హాజరయ్యారు. అనంతరం పలువురు సంఘాల నాయకులు మాట్లాడుతూ అశోక విజయదశమి ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తల గంగారం, బంసెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్, గౌరవ అధ్యక్షుడు సంఘీ రాజలింగం, మాల మహానాడు నాయకుడు రాజనర్సు, మద్దెల బాలయ్య, నాయకుడు శంకర్, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి సంగయ్య, లింగంపేట నాయకుడు లెగ్గల రాజ్, బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు బొంపల్లి రవితేజ, బంసెఫ్ జిల్లా అధ్యక్షుడు సాయి గౌతమ్, సంజీవ్ తదితర మేధావులు, నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పొత్తూరు సమీపంలో రోడ్డు ప్రమాదం యువకుడు మృతి



**ఇల్లంతకుంట, అక్టోబర్ 21 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూరు గ్రామానికి చెందిన తాళ్లపల్లి అక్షయ్ గౌడ్ (20) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పొత్తూరు సమీపంలో చెట్టును ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు తాళ్లపల్లి శ్రీధర్, లావణ్య దంపతుల కుమారుడు. అక్షయ్ మృతితో కందికట్కూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఏసీపీ పి. ప్రకాష్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన బీఆర్ఎస్ నేతలు



**సిరికొండ, అక్టోబర్ 21 జనం సాక్షి:** నిజామాబాద్ ఏసీపీ పి. ప్రకాష్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ పి. ప్రకాష్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పండుగను పురస్కరించుకుని ఆయనను కలిసి తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరవోయిన శ్రీనివాస్, పెద్ద వాల్గోట్ వీడీసీ చైర్మన్ తలకట్ల గంగా రెడ్డి, సిరికొండ మాజీ సర్పంచ్ రాజారెడ్డి, సంతోష్ రెడ్డి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన సిరికొండ కాంగ్రెస్ నేతలు



**సిరికొండ, అక్టోబర్ 21 జనం సాక్షి:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిరికొండ మండల కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ రూరల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు తెలియజేసి పండుగ శుభాకాంక్షలు అందజేశారు. విజయదశమి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బకారం రవి, నర్సింగ్, ముత్తెన్న, సల్ల రాజారెడ్డి, నర్మాల భాస్కర్, మల్లేష్, నరేందర్, సతీష్, రాజేశ్వర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీకి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21( జనం సాక్షి)** విజయదశమి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీకి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి ప్రజల సంక్షేమం, ప్రగతి మరింత ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు. పండుగను ప్రజలంతా సోదరభావం, సంతోషాలతో జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్నమి రాజేశ్వర్, సుధీర్ రెడ్డి, శ్రావణ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### తిరుమల-తిరుపతి దేవస్థానం

## 35 మందికి శ్రీవారి సేవ చేసే అవకాశం



అంతర్గాం,అక్టోబర్ 21 జనంసాక్షి : తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి 20 వరకు నిర్వహించిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి సేవ చేసేందుకు గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన 35 మంది మహిళలు, పురుషులకు అవకాశం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో నేదునూరి సాంబశివరావు, మేడి తిరుపతి నేతృత్వంలో 35 మంది సభ్యులు తిరుమలకు వెళ్లి బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఈ బృందంలో విశ్వభారతి విద్యాసంస్థల ప్రతినిధి బండారపు యాదగిరి గౌడ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసారి ప్రత్యేకంగా శ్రీ శృంగేరి శంకర మఠం, పుష్పగిరి మఠాల్లో శ్రీవారి సేవ చేసే అవకాశం కల్పించడం పట్ల శ్రీవారి సేవా సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. స్వామీ వారి సేవలో పాల్గొనే అవకాశం కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు, సంబంధిత మఠాధి పతులు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు సిరికొండ బీఆర్ఎస్ నేతల దసరా శుభాకాంక్షలు



**సిరికొండ, అక్టోబర్ 21 జనం సాక్షి:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిరికొండ మండల బీఆర్ఎస్ నాయకులు నిజామాబాద్‌లో తెలంగాణ ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను, నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగనన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురికి దసరా శుభాకాంక్షలు తెలియజేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. విజయదశమి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని నాయకులు ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా నాయకులను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహోయిన శ్రీనివాస్, తలకట్ల చిన్న గంగారెడ్డి, నర్సారెడ్డి, సంతోష్ రెడ్డి, రాజారెడ్డి, ఆన్సర్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జగన్‌లకు దసరా శుభాకాంక్షలు తెలిపిన రావుట్ల నాయకులు



**సిరికొండ, అక్టోబర్ 21 జనం సాక్షి:** దసరా పండుగను పురస్కరించుకొని రావుట్ల గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్‌తో పాటు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నిజామాబాద్‌లో తెలంగాణ ఆర్టీసీ మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. దసరా పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతిసౌభాగ్యాలు నింపాలని నాయకులు ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్, బాజిరెడ్డి జగన్‌లను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావుట్ల గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్, అమితాబ్ బచ్చన్, తోట రాజన్న, తోట రాజేందర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, యువకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జమ్మి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని,అక్టోబర్ 21 జనంసాక్షి:** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ దసరా పండుగను పురస్కరించుకొని కోదండ రామాలయంలో నిర్వహించిన జమ్మి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్, ఆలయ చైర్మన్ గట్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భక్తులతో కలిసి జమ్మి పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులను, స్థానిక ప్రజలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆప్యాయంగా పలకరించి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. దసరా పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పండుగలను ప్రజలందరూ కలిసిమెలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం మన సంప్రదాయమని తెలిపారు. రామగుండం నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ప్రాంత అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కార్పొరేటర్ లు ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న జై భారత్ అకాడ ప్రదర్శనలు

### గంటలపాటు బాలికల ప్రత్యేక విన్యాసలు



**గోదావరిఖని, అక్టోబర్ 21 జనంసాక్షి :** సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో దసరా (విజయ దశమి) వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా సంబరాలు చూపెట్టారు. దసరా పండుగ అంటే సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో అకాడ కు ఒక ప్రత్యేకత ఉంది. దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరిఖని నగరంలో జై భారత్ హనుమాన్ అకాడ నేతృత్వంలో పెద్ద ఎత్తున అకాడ ప్రదర్శన చేపట్టారు. అకాడ ప్రదర్శనకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, పెద్దపెల్లి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఆరు దశాబ్దాలుగా జై భారత్ హనుమాన్ అకాడ దసరా పండుగ సందర్భంగా చేపడుతున్నా విన్యాసాలు ఎప్పటికీ మర్చిపోలేము అని చెప్పారు. ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరు అకాడలో శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా వద్ద ఎస్సీ కమిషన్ సభ్యులు రామచందర్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అసంపల్లి శ్రీనివాస్ అకాడ విన్యాసాలు చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. అదేవిధంగా బిజెపి రాష్ట్ర నాయకురాలు కందుల సంధ్యారాణి కూడా అకాడ విన్యాసాలు చేసి ఆకర్షణీయంగా నిలిచింది. కత్తి, తల్వార్, కర్రలతో హనుమాన్ అకాడ బాలికల బృందం చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్య లో తరలివచ్చారు. గోదావరిఖని, రామగుండం, ఎన్ టి పి సి, 8 వ కాలనీ, బసంత్ నగర్, ఎఫ్సీఐ రావణాసురుడి వధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో చిన్న పెద్దా అని తేడా లేకుండా ప్రతి ఒక్కరు భాగస్వాములై ఆనందోత్సవాల మధ్య దసరా సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో హనుమాన్ అకాడ మాస్టర్స్ మచ్చ శంకర్, ఎండి జాఫర్ నాయకులు పెద్దెల్లి ప్రకాష్, నాతరి ఆదిత్య, గాలి పెల్లి తిరుపతి, వడ్లూరి శ్రీనివాస్, శనిగరపు చంద్రశేఖర్, తోపాటు వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

# గన్నేరువరం మండల వ్యాప్తంగా ఘనంగా దసరా వేడుకలు

### గన్నేరువరంలో ఘనంగా దసరా వేడుకలు - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు





**గన్నేరువరం, అక్టోబర్ 21 (జనంసాక్షి):** గన్నేరువరం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దసరా పండుగ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన గన్నేరువరంలోని చావడి వద్ద గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సమీపంలో నిర్వహించిన దసరా వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వేద పండితులు మణిశంకర్ శర్మ, అర్చకులు ప్రదీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు, రిటైర్డ్ ఎస్ఐ బుర్ర ఎల్లయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్, మంద దిలీప్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన జమ్మి పూజ కార్యక్రమంలో వారు పాల్గొని గ్రామ ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎస్పీ రాజేష్ చంద్ర**

**అమరవీరుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 21( జనం సాక్షి)** దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్, ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని అక్సాయ్‌చిన్ ప్రాంతంలో చైనా దళాల దాడిలో 10 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులను ఎదుర్కొంటూ 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందగా, తెలంగాణ నుంచి నలుగురు అమరులయ్యారని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలంటే శాంతిభద్రతలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులు ఏ సమస్య ఉన్నా తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోటీలు**

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజల కోసం ఆన్‌లైన్‌లో వ్యాసరచన, షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. విద్యార్థుల వ్యాసరచన పోటీలకు అక్టోబర్ 28, పోలీసు సిబ్బంది వ్యాసరచన పోటీలకు అక్టోబర్ 27, షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలకు అక్టోబర్ 30 చివరి తేదీగా పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నర్సింహారెడ్డి, డీఎస్పీలు ఎస్. మధుసూదన్, పి. విట్టల్ రెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**లింగంపేట్ అక్టోబర్ 21(జనం సాక్షి)** బాధితులకు ప్రభుత్వం అందించే సహాయక చర్యల్లో భాగంగా లింగంపేట్ మండల పరిధిలోని పర్మల్ల గ్రామానికి చెందిన ఇర్ల సిద్దయ్యకు మంజూరైన రూ. 32,000/-ల ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కును బుధవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాయిరాం యాదవ్ సూచనలతో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొడబోయిన శ్రీనివాస్ ఈ చెక్కును బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, ఎమ్మెల్యే సహకారంతో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు త్వరితగతిన అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం బాబాయి నరేష్, ఉపసర్పంచ్ కొడబోయిన శ్రీను, డైరెక్టర్ కొడబోయిన సాయికుమార్, గంట బాబు, చాకలి రవి, ఇర్ల సాయిలు, రవి గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మినిస్టర్ వివేక్ వెంకటస్వామికి అలయ్ ..బలయ్ ఆహ్వానం



గోదావరిఖని,**అక్టోబర్ 21** జనంసాక్షి : ఈనెల 25న స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే అలాయి .. బలాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రివర్యులు వివేక్ వెంకట స్వామిని హాజరు కావలసిందిగా ఆహ్వానించామని సామాజిక ఐక్యవేదిక కన్వీనర్,అలయ్ బలయ్ వ్యవస్థపాక చైర్మన్ క్యాతం వెంకటరమణ అన్నారు. ఆహ్వాన సమితి అధ్యక్షులు ముడతనపల్లి సారయ్య, ముఖ్య సలహాదారు బండారి రాజమల్లు, ప్రధాన కార్యదర్శి రెడ్డి భాస్కర్ తదితరులు ఉన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు ఆటంకం కావు

**వైష్ణవికి స్ఫూర్తి ఎడ్యుకేషనల్ ట్రస్టు చేయూత**

**విద్యా ఖర్చులు భరించనున్న కాసిరెడ్డి విక్రంరెడ్డి**



**గోదావరిఖని, జనంసాక్షి :** ఆర్థిక ఇబ్బందులు ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో స్ఫూర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా దత్తత కార్యక్రమాన్ని బుధవారం గోదావరిఖనిలోని శ్రీ సిద్ధార్థ హై స్కూల్‌లో నిర్వహించారు. గోదావరిఖనికి చెందిన ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని కొత్తపల్లి వైష్ణవి బీటెక్ విద్యను పూర్తిచేసే వరకు అయ్యే మొత్తం విద్యా ఖర్చులను భరించేందుకు కరీంనగర్‌కు చెందిన, ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్న విక్రమ్ ముందుకు వచ్చారు. వైష్ణవి ప్రస్తుతం బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ కార్యక్రమానికి స్కూల్ కరస్పాండెంట్ విజయానంద్, 52వ డివిజన్ కార్పొరేటర్ చిదురాల నాగరాజు, వైశ్య సంఘం అధ్యక్షుడు నటరాజ్ శేఖర్, వైశ్య సంఘం సీనియర్ నాయకులు చిదురాల రవీందర్ హాజరయ్యారు. ట్రస్టు ఫౌండర్ అప్పాల విలాస్ , కె సతీష్,జి గణేష్ ,వి ప్రవీణ్ ,కె వీరకుమార్, జి. వెంకటేష్, వి. సంతోష్, జె సతీష్, ఎస్ బాలకృష్ణ, జి సుమోత్, ఈ. రాజేందర్, ఆర్. భాస్కర్, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమవుతున్న విద్యార్థులకు దాతలు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చని తెలిపారు. విద్యాదానం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని, మరింత మంది దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.వైష్ణవి బీటెక్ విద్య పూర్తయ్యే వరకు పూర్తి విద్యా ఖర్చులను భరించేందుకు ముందుకు వచ్చిన విక్రమ్ సేవాభావాన్ని అతిథులు అభినందించారు. ఆయనకు స్ఫూర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల ఉన్నత విద్యకు సహకరించడం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం లక్ష్యంగా స్ఫూర్తి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ భవిష్యత్తులోనూ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని ట్రస్ట్ ప్రతినిధి ఏ.విలాస్ తెలిపారు.

# రైతులకు శాపంగా మారిన కంకి పురుగు

**ఇదే అదనుగా తీసుకుని ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు మందుల విక్రయం**

**అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం: ఏవో సల్లావుద్దీన్**



**గంభీరావుపేట, అక్టోబర్ 21 జనం సాక్షి:** గంభీరావుపేట మండలంతో పాటు వివిధ గ్రామాల్లో వరి పంటకు కంకి నల్లి, దోమపోటు వంటి తెగుళ్లు రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆరు నెలల పాటు కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే చివరి దశలో పురుగుల ఉధృతి పెరగడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు పురుగుమందుల విక్రయాలు?**

పంటను కాపాడుకునేందుకు రైతులు పురుగుమందుల కోసం ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొన్ని దుకాణాల్లో అధిక ధరలకు మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పంట నష్టంతో ఆందోళన చెందుతున్న రైతులపై అధిక ధరల భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దుకాణాల్లో ధరలను తనిఖీ చేయాలని కోరుతున్నారు.

**అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏవో సల్లావుద్దీన్**

ఈ విషయంపై ఏవో సల్లావుద్దీన్ మాట్లాడుతూ, ఎరువులు లేదా పురుగుమందులను నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత ఫర్టిలైజర్ షాపులపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# 108 అంబులెన్స్‌లో సురక్షిత ప్రసవం

## పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి.. తల్లీబిడ్డ క్షేమం



**గంభీరావుపేట అక్టోబర్ 21 జనం సాక్షి;** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నస్రీన్ అనే గర్భిణికి 108 అంబులెన్స్‌లో సురక్షితంగా ప్రసవం జరిగింది. మంగళవారం సాయంత్రం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ చెలిమెల సాయికృష్ణ, పైలట్ మనోజ్ కుమార్ గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో అప్రమత్తమయ్యారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్స్‌లోనే ప్రసవం చేయించారు. షేక్ నస్రీన్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను మెరుగైన వైద్యం కోసం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు. తల్లీబిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో స్పందించి సురక్షిత ప్రసవానికి సహకరించిన 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

# మున్నూరు కాపుల ఆత్మబలమే ఐక్యత

## ఈ నెల 23న అట్టహాసంగా దసరా ఆత్మీయ సమ్మేళనం

## కుటుంబ సమేతంగా తరలిరావాలని ధర్మపురి సంజయ్ పిలుపు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 జనం సాక్షి :** జిల్లాలోని మున్నూరు కాపు కుటుంబాల మధ్య ఐక్యతను, ఆత్మీయతను పెంపొందించేందుకు ఈ నెల 23వ తేదీన దసరా ఆత్మీయ సమ్మేళనాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిజామాబాద్ మాజీ మేయర్, జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ తెలిపారు. ప్రగతినగర్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఈ కార్యక్రమం శుక్రవారం జరగనుందని ఆయన పేర్కొన్నారు. కుల బంధువుల మధ్య స్నేహభావాన్ని మరింత పెంపొందించి, సంఘాన్ని బలోపేతం చేయడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు సంజయ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులంతా ఉత్సాహంగా పాలుపంచుకుని, పండగ వాతావరణంలో ఆనందంగా గడపాలని ఆయన కోరారు. జిల్లాలోని మున్నూరు కాపు కుటుంబాలన్నీ పెద్ద సంఖ్యలో హాజరై, ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుంది

## సీపీ సాయి చైతన్య




**నిజామాబాదు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 జనం సాక్షి:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాలులో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాల సందర్భంగా బుధవారం 21 మంది అమరవీరుల కుటుంబ సభ్యులతో ప్రత్యేక సంక్షేమ సదస్సు నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అదనపు డీసీపీ, వివిధ డివిజన్ల ఏసీపీలు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అమరుల కుటుంబాలకు అందుతున్న సంక్షేమ సహాయ కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు, ఒక్కో కుటుంబాన్ని ప్రత్యేకంగా పలకరించి వారి సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు యావత్ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి బాగోగులను ఎప్పకటికప్పుడు పర్యవేక్షిస్తూ సత్వర పరిష్కారాలు అందజేస్తామని కమిషనర్ భరోసా కల్పించారు.

# వీణవంకలో అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు

## యఫ్ టీవీ అధినేత పాడి ఉదయ్ నందన్ రెడ్డి



**వీణవంక అక్టోబర్ 21(జనం సాక్షి)** వీణవంక మండల కేంద్రంలో మంగళవారం రోజు యఫ్ టీవీ అధినేత సీఈఓ పాడి ఉదయ్ నందన్ రెడ్డి,వారి సోదరుడు డాక్టర్ పాడి కళ్యాణ్ రెడ్డిలు కలసి వీణవంక మండల కేంద్రంలోని విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు వారి స్వగృహంలో సంప్రదాయ బద్ధంగా జమ్మి పూజ పండితులు సతీష్ శర్మ,వేద మంత్రాలతో అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకల్లో భాగంగా శమీ వృక్షాన్ని ప్రతిష్టిపించి ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో కొనసాగాయి.జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి విజయదశమి ప్రాముఖ్యతను చాటి చెప్పారు.వారి నివాసంలో పండుగ వాతావరణం నెలకొనగా పూజా కార్యక్రమంలో పాడి ఉదయ్ నందన్ రెడ్డి, గ్రామ ప్రజలు వివిధ కులాల పెద్దలు,షమీ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ ప్రజలు జమ్మిని తీసుకుని ఒకరి ఒకరు పరస్పరంగా అభినందనలు తెలుపుకున్నారు. పాడి ఉదయ్ నందన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో పాడి పంటలతో వర్ధిల్లాలని ప్రజలందరూ సుఖశాంతులతో అష్ట ఐశ్వర్యాలతో ప్రతి పనిలో విజయం సాధించాలని వారుకోరుకుంటూ వీణవంక గ్రామ ప్రజలందరికీ హుజురాబాద్ నియోజకవర్గం ప్రజలందరికీ విజయ దశమి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీణవంక మాజీ జెడ్పిటిసి దసారపు ప్రభాకర్,ఆయిత రాంబాబు,దూడపాక రాజు,మేకల సమ్మిరెడ్డి,మంతెన శ్రీధర్,మాజీ కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ హమీద్,మొహమ్మద్ అబ్దుల్ కరీం,వేణు సందీప్,సముద్రాల బిక్షపతి,మాజీ ఎంపీటీసీ మోటం వెంకటేష్,మోటం విష్ణు,రాయిశెట్టి కుమార్,తాళ్లపెల్లి కుమారస్వామి, దాసరపు లోకేష్,దాసరపు చందు, దాసరపు వంశీ,తోట్ల రాకేష్,సిరిగిరి శేఖర్,పస్తాం కుమార్,తోపాటు ఆయా కులాల పెద్దలు వీణవంక గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయదశమి వేడుకలు విజయవంతం చేశారు.

# అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

## లింగంపేట్ మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ

## లింగంపల్లి కుర్దు గ్రామంలో అలై బలై క్రాకర్ షో కార్యక్రమం





**లింగంపేట్ అక్టోబర్ 21(జనం సాక్షి)** లింగంపేట్ మండల కేంద్రంలో హనుమాన్ మందిరంలో దసరా ప్రత్యేక పూజలు గ్రామ సర్పంచ కౌడా రవి ఉప సర్పంచ ప్రసాద్ గౌడ్ వార్డు మెంబర్లు,మరియు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు నిర్వహించారు అనంతరం ప్రతి సంవత్సరం దసరా రోజు జెండా ఆవిష్కరణ చేశారు. లింగంపేట్ మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామ చెరువు కట్టను కాబోయే మినీ ట్యాంక్ బండ్ గా రూపుదిద్దుకోబోతున్న సందర్భంగా గ్రామ పర్యాటక ప్రాంతంగా మార్చాలన్న లక్ష్యంతో గ్రామ సర్పంచ్ ప్రత్యూష సాయిరాం గారు పాలకవర్గా వర్గ సభ్యులు కలిసి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ ఉన్నారు. ఈరోజు విజయదశమి సందర్భంగా గ్రామంలో ప్రజల సమక్షంలో చెరువు కట్టపై ఈరోజు సాయంత్రం విజయదశమి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా సీఐ మరియు ఎస్ఐ గార్ల చేతులమీదుగా క్రాకర్స్ షో కార్యక్రమాన్ని ప్రారంభించుకొని తదరనంతరం అలై బలై కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఆలాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి దసరా శుభాకాంక్షలు గ్రామస్తులు ఎంతో సంతోషంగా అక్కడే జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిఐఎస్ఐ గ్రామస్తులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్ల సాయిరాం వీడీసీ సభ్యులు పాలకవర్గ సభ్యులు గ్రామ యువజన సంఘాలు గ్రామస్తులు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పట్టుదలతో విజయ తీరాలకు చేరిన తానిపర్తి చికిత



**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 21, ( జనం సాక్షి)** పేదరికం విజయానికి అడ్డంకి కాదని, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని నిరూపించిన ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితను పద్మనాయక వెలమ సంఘం ఘనంగా సన్మానించింది. విజయదశమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జపాన్‌లోని నగోయాలో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో రెండు బంగారు పతకాలు సాధించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన చికితకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత పేద కుటుంబంలో జన్మించినప్పటికీ, ఆర్చరీ క్రీడలో ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగింది. ఆమె తండ్రి తానిపర్తి శ్రీనివాసరావు ప్రోత్సాహంతో ఆర్చరీలో శిక్షణ ప్రారంభించింది. అయితే, సరైన విల్లు కొనుగోలు చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినప్పటికీ కుమార్తె కలను సాకారం చేయాలనే సంకల్పంతో శ్రీనివాసరావు తన పొలాన్ని, తనకున్న హార్వెస్టర్‌ను విక్రయించి ఆమెకు అండగా నిలిచారు. తండ్రి చేసిన త్యాగాన్ని గుర్తించిన చికిత, ఎలాగైనా ఉన్నత స్థాయికి చేరుకుని ఆయన కష్టానికి తగిన ఫలితాన్ని అందించాలనే పట్టుదలతో నిరంతరం కఠోర సాధన చేసింది. తన ప్రతిభ, అంకితభావం, పట్టుదలతో అంతర్జాతీయ స్థాయిలో రెండు పసిడి పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. చికిత సాధించిన విజయం ఎంతోమంది యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పద్మనాయక వెలమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. పేదరికాన్ని అధిగమించి లక్ష్యాన్ని చేరుకున్న చికిత ప్రయాణం పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు.

# గంభీరావుపేట మండల వ్యాప్తంగా ఘనంగా దసరా వేడుకలు

### జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు.. జమ్మి ఆకుల పంపిణీ

### దుర్గాదేవి నవరాత్రులు పూర్తి.. ఘనంగా అమ్మవారి శోభాయాత్రలు



**గంభీరావుపేట, అక్టోబర్ 21జనం సాక్షి:** గంభీరావుపేట మండల వ్యాప్తంగా విజయదశమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. గ్రామ పురోహితులు పార్థసారథి రాజు పంతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో ప్రజలు ముందుగా పాలపిట్టను దర్శించుకున్నారు. అనంతరం రామాలయ చైర్మన్ మల్లుగారి నర్సా గౌడ్, ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల గరుడ సేవ నిర్వహించారు. మహిళలు స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. అనంతరం స్వామివారు ప్రధాన వీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

**జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు**

అనంతరం గ్రామస్తులు జమ్మిచెట్టు వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. పూజల అనంతరం జమ్మి ఆకులను పరస్పరం పంచుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

**ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవాలు**

మండల వ్యాప్తంగా నిర్వహించిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ మండపాల వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను భక్తులు ఘనంగా శోభాయాత్రగా తీసుకెళ్లారు. డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపులు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేశారు. దసరా వేడుకలు, అమ్మవారి ఉత్సవాల్లో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్కీడ్రా విజేతలకు బహుమతుల పంపిణీ



**గన్నేరువరం, అక్టోబర్ 21 (జనంసాక్షి):** గన్నేరువరం మండలకేంద్రంలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రా విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బహుమతుల స్పాన్సర్లుగా ఉప సర్పంచ్ రామంచ స్వామి, 8వ వార్డు సభ్యులు మచ్చ సాయికృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గన్నేరువరం గ్రామ సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు, రిటైర్డ్ ఎస్ఐ బుర్ర ఎల్లయ్య గౌడ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతులు పొందిన విజేతలు: ఒకటవ బహుమతి (ఎలక్ట్రికల్ బైక్) ఇల్లంతకుంటకు చెందిన సుమద్రా శ్రీ, రెండవ బహుమతి (వాషింగ్ మెషిన్) పారువెళ్లకు చెందిన పిట్టల ఎల్లయ్య, మూడవ బహుమతి (సైకిల్) గన్నేరువరంకు చెందిన న్యాత మాధవి, నాలుగవ బహుమతి (మిక్సర్ గ్రైండర్) గన్నేరువరంకు చెందిన తుర్క రాజేష్, ఐదవ బహుమతి (ఫ్యాన్) గన్నేరువరంకు చెందిన ఇక్కుర్తి ఉషయ్య, మిగతా ఐదుగురు విజేతలకు ఓదార్పు బహుమతులుగా గోడ గడియారాలను అందజేశారు. అనంతరం సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు మాట్లాడుతూ.. యువశక్తి ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. రిటైర్డ్ ఎస్ఐ బుర్ర ఎల్లయ్య గౌడ్ మాట్లాడుతూ.. యువత ఇలాంటి సామాజిక కార్యక్రమాలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ సభ్యులు గంట గౌతమ్, మచ్చ సాయి కృష్ణ, ఏలేటి ప్రవీణ్ రెడ్డి, కాల్వ నాగరాజు ,సందవేణి ప్రశాంత్, రాకేష్, బుర్ర అనూరుద్, బుర్ర వినయ్, నితిన్,శశిధర్, నక్క అరవింద్, సుగుణాకర్, పొన్నాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

### కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతానికి కృషి

### నిజామాబాదులో ఘనంగా సంస్మరణ దినోత్సవం



**నిజామాబాదు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 జనం సాక్షి:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథులుగా హాజరై అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని కొనియాడారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుండి ఇప్పటివరకు 21 మంది పోలీసులు వీరమరణం పొందగా, దేశవ్యాప్తంగా ఈ ఏడాది 154 మంది అమరులయ్యారని తెలిపారు. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కలెక్టర్, సీపీ భరోసా కల్పించారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించే ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, వివిధ విభాగాల ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# ఆంజనేయ స్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ



**మల్యాల అక్టోబర్ 21 (జనం సాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని విజయదశమి సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ బల్ మురి వెంకట్ రావు దర్శించుకున్నారు.ఆలయ అధికారులు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు.కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు ఆలయ సిబ్బంది మండల నాయకులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



**మల్యాల అక్టోబర్ 21 (జనం సాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని విజయదశమి సందర్భంగా మంగళవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పుల్లా కార్తిక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయ అధికారులు పూర్ణకుంభంతో న్యాయమూర్తి ఘనస్వాగతం పలికారు.అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి,శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఈఓ హరిహరనాథ్, పర్యవేక్షకులు సునీల్,ప్రధాన అర్చకుడు డా.జితేంద్ర ప్రసాద్,చిరంజీవ స్వామి,మారుతి ప్రసాద్, స్థానాచార్యులు కపిందర్, ఆలయ పరిశీలకుడు అశోక్,అర్చకులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

### వారి త్యాగాలు చిరస్మరణీయం



**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)అక్టోబర్ 21:** పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం (అక్టోబర్ 21) గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుడు కురుసం బాపుకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన కురుసం బాపు సమాధి వద్ద సీఐ ప్రసాదరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తూ ఎంతోమంది పోలీసులు అమరులయ్యారని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు వృథా కావని, వారి స్ఫూర్తితో పోలీసులు ప్రజల భద్రతకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి కురుసం బాపు సమాధి వద్ద నివాళులర్పించారు. అమరులైన పోలీసుల సేవలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు, ఏఎస్ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు సీహెచ్. రాజయ్య, జె. వెంకటేష్, ఎన్. విశ్వనాథ్, సీహెచ్. రామచంద్రం, ఎస్‌డీ అఫ్రోజ్, మల్లేశ్వరి, శ్రీలత, అంజలి, హోంగార్డులు శ్రీధర్, మల్లేష్, విజయమణి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా ఆదివరాహస్వామి కళ్యాణ మహోత్సవం



**కమాన్‌పూర్, అక్టోబర్ 21, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి దేవస్థానంలో మంగళవారం మాస కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ డైరెక్టర్లు బూస శ్రీనివాస్ గౌడ్, చాట్ల రాయమల్లు, కొంతం శ్రీనివాస్, ఆలయ అర్చకులు రామానుజచార్యులు వేద మంత్ర ఉత్సవాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనం అందజేశారు. ఇటు స్వామివారి కల్యాణ మహోత్సవం అటు దసరా పండుగ కావడంతో ఆదివారాహ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఈ కళ్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈవో కాంత రెడ్డి, ఆలయ డైరెక్టర్లు పిల్లి రాజు, బూస శ్రీనివాస్ , తీగల రాజయ్య, చాట్ల రాయమల్లు, కొంతం శ్రీనివాస్, అనవేన శ్యామల సదితో పాటు అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన ఘనంగా దసరా ఉత్సవాలు



**కమాన్ పూర్, అక్టోబర్ 21, (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలో ఊరూరా దసరా ఉత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఊరూరా గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శమీ వృక్షాలకు పూజలు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో గ్రామ పంచాయతీ కార్యాలయాల నుండి డప్పు చెప్పుళ్లతో మంగళహారతులతో శమీ వృక్షాల వద్దకు గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు తరలివెల్లారు. అక్కడ పురోహితులతో పూజా కార్యక్రమం అనంతరం జమ్మి (శమీ) ఆకులు తెంపి తమ బందు మిత్రులకు చేతుల్లో పెట్టి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆశీర్వాచనాలు తీసుకుని ఆత్మీయత భావాన్ని చాటుకున్నారు.

## చేసిన అప్పులు తీర్చలేక చెరువులో పడి మృతి



**ముస్తాబాద్ అక్టోబర్ 21( జనం సాక్షి)** ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మద్దికుంట బాలయ్య 43 సంవత్సరాలు, చేసిన అప్పులు తీర్చలేక పెద్ద చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాలయ్య కొన్ని రోజుల నుండి తాగుడుకు బానిసలై పిచ్చి పిచ్చి చేస్తూ తిరుగుతూ జీవితం పై విరక్తి చెంది , బతుకమ్మ పండుగ రోజు మధ్యాహ్నం పూట ఇంటి నుండి వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు వెంటనే స్థానిక ఎస్సై జ్యోతి సంఘటన స్థలానికి చేరుకోని పూర్తిస్థాయిలో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

### మంథని ఎస్సై సందీప్ కుమార్



**మంథని, అక్టోబర్ 21, (జనంసాక్షి) :** విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రత కోసం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని మంథని ఎస్సై సందీప్ కుమార్ అన్నారు. పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు పెద్దపల్లి జిల్లా మంథని పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. మంథని పట్టణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూలు సమర్పించి, అమరవీరులకు సెల్యూట్ చేసి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మంథని పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ధైర్యం, నిజాయితీ, అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తామని ఈ సందర్భంగా పోలీసులు ప్రతిజ్ఞ చేశారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం - వారి సేవలు స్ఫూర్తిదాయకం

### కలెక్టర్ చిత్రా మిశ్రా - సీపీ గౌష్ ఆలం





**కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 21 ( జనం సాక్షి) :** ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు.. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల నామావళిని చదివి వినిపించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. జిల్లా యంత్రాంగానికి పోలీస్ శాఖ వెన్నెముక వంటిదని, శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమానికి ఇచ్చారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, దేశ సమగ్రత, అంతర్గత భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అంకితభావంతో సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వం వారికి అందాల్సిన నష్టపరిహారాలను పూర్తి స్థాయిలో అందేలా చూస్తామన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, లఘు చిత్రాల పోటీలు, విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు.

## చరిత్రకు సాక్ష్యం.. భక్తికి నిలయం లింగన్నపేట వెంకన్న

### రథోత్సవానికి వేళాయె.. భక్తజన సందోహానికి లింగన్నపేట సిద్ధం




**రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట, అక్టోబర్ 21 జనం సాక్షి:** గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం చారిత్రక ప్రాధాన్యంతో పాటు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రత్యేక పూజలు, వాహనసేవలు, కల్యాణోత్సవం, రథోత్సవంతో ఈ ఆలయం భక్తుల విశ్వాసానికి కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

**1961 నాటి గ్రంథంలో ఆలయ ప్రస్తావన**

లింగన్నపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ చారిత్రక విశిష్టతకు 1961లో ప్రచురితమైన భారత జనగణన శాఖ గ్రంథంలోని ప్రస్తావన ఆధారంగా నిలుస్తోంది. అశ్వయుజ మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ, ధ్వజారోహణం, హోమాలు, కల్యాణోత్సవం, వివిధ వాహనసేవలు, గరుడసేవ, రథోత్సవం వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**రథోత్సవం.. భక్తి వైభవం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని వివిధ వాహనాలపై ఊరేగించనున్నారు. ముఖ్యంగా ఈనెల 27వ తేదీ తెల్లవారుజామున నిర్వహించే రథోత్సవానికి జిల్లా నలుమూలలతో పాటు పొరుగు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. వారం రోజులపాటు జరిగే ఉత్సవాలతో లింగన్నపేట గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. ఆలయ జాతర స్థానిక సంప్రదాయాలకు, గ్రామీణ జీవనశైలికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తోంది.

**వేద పండితులచే స్వామివారికి నిత్యం ప్రత్యేక పూజలు**

శృంగేరి పీఠానికి చెందిన రాధాకృష్ణశర్మతో పాటు ఆలయ వేద పండితులు స్వామివారికి నిత్యం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయంలో భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని స్థానిక ప్రజల్లో అపారమైన నమ్మకం ఉంది. దీంతో నిత్యం భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు



**బ్రహ్మోత్సవాల కార్యక్రమాల వివరాలు**

నేడు ఉదయం 8 గంటలకు పుట్ట బంగారం తెచ్చుట, విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం.

అక్టోబర్ 23, శుక్రవారం: ఉదయం 8 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణం, గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, హోమం, బలిహరణం. సాయంత్రం 5 గంటలకు దేవతాహ్వానం. రాత్రి 8 గంటలకు స్వామివారి ఎదుర్కోలు, అశ్వవాహనసేవ.

అక్టోబర్ 24, శనివారం: ఉదయం హోమం, బలిహరణం. సాయంత్రం 5 గంటలకు కల్యాణోత్సవం, హోమం, బలిహరణం. అనంతరం హనుమంతసేవ.

అక్టోబర్ 25, ఆదివారం: పొన్నసేవ.

అక్టోబర్ 26, సోమవారం: గరుడసేవ.

అక్టోబర్ 27, మంగళవారం: తెల్లవారుజామున రథోత్సవం.

అక్టోబర్ 28, బుధవారం: సప్తవర్ణాలు, ఏకాంతసేవ.

**భక్తులకు ఆహ్వానం ఆలయ చైర్మన్ పాపారావు.**

"నేటి నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలి" అని ఆలయ కమిటీ చైర్మన్ పాపారావు తెలిపారు.



# గోదావరిఖనిలో అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

## సింగరేణి కార్మికులకు సొంతింటి కలను త్వరలోనే నిజం చేస్తాం

## ఐ.టీ. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

## రామగుండం ప్రాంతాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తా : రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి సంస్థ, సౌజన్యంతో గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ దంపతులు తదితర ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీ, టీవీ కళాకారులతో పాటు ప్రముఖ గాయకులు, సినీ నటుడు శివారెడ్డి తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాంతం రామగుండం అని అన్నారు. సింగరేణి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, ఇతర కార్మిక వర్గాల ప్రతినిధులకు పేరుపేరునా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి కార్మికుల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సైతం బోనస్ అందించే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు సొంతింటిని నిర్మించుకోవాలనే కలను కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే నిజం చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పష్టం చేశారు. నగర మేయర్ మహంకాళి స్వామి, ఎస్సి కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ, కార్పోరేటర్లు, నాయకులు, ప్రజలు, కార్మికులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐదేళ్ల విరామం తర్వాత వైభవంగా దసరా వేడుకలు

## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 (జనం సాక్షి)** ఐదేళ్ల విరామం అనంతరం కామారెడ్డి పట్టణంలో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. గత 36 ఏళ్లుగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో దసరా వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కరోనా మహమ్మారి, ఇతర పరిస్థితుల కారణంగా గత ఐదేళ్లుగా ఉత్సవాలు నిర్వహించలేకపోయామని, తాజాగా తిరిగి అదే ఉత్సాహంతో వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆదరణ, సహకారమే ఈ ఉత్సవాల విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. విజయదశమి చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని షబ్బీర్ అలీ అన్నారు. దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, న్యాయం, ధర్మం, విశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రజలంతా మంచి మార్గంలో నడుస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు ప్రత్యేకమైన గంగా జమునా తెహజీబ్ సంప్రదాయానికి అనుగుణంగా అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగలను జరుపుకోవడం మన సమాజ ప్రత్యేకత అని అన్నారు. దసరా వంటి పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. విజయదశమి సందర్భంగా అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కామారెడ్డి పట్టణ ప్రజలంతా ఐకమత్యంతో ఉంటూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్న ఆయన, ప్రజల భాగస్వామ్యంతో భవిష్యత్తులోనూ సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# దసరా వేడుకల్లో పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు



**మంథని, అక్టోబర్ 21, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ముత్యాలమ్మ వాడలో జమ్మి చెట్టు వద్ద మంగళవారం నిర్వహించిన దసరా వేడుకల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొన్నారు. జమ్మి చెట్టు వద్దకు విచ్చేసిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గ ప్రజలందరికీ పేరుపేరునా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నింపాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

# ఘనంగా దసరా ఉత్సవాలు

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు






**సదాశివనగర్,అక్టోబర్ 21 (జనంసాక్షి)** దసరా పండుగను పురస్కరించుకొని సదాశివనగర్ మండల కేంద్రంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ కళారూపాలు, ఆటపాటలు, సంప్రదాయ ప్రదర్శనలతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. సాయి లవోలా కళాబృందం, కళాకారుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతూ సామాజిక ఐక్యతను చాటేలా ఉత్సవాలు సాగాయి. పోలీసులు భద్రతను పర్యవేక్షించారు. పండుగ వేడుకలు విజయవంతం కావడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ప్రజల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు దోహదపడిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంకాయల శిరీష రవి, ఉపసర్పంచ్ కుందెన ప్రవీణ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాణిక్యం దేవదాస్, ప్రధాన కార్యదర్శి బంధాల సాగర్, కోశాధికారి పోలబోయిన సాయిలు, కార్యదర్శి చిందం రమేష్, ఉపాధ్యక్షులు జగ్గా బాలరాజు, కుప్రియాల చిన్న బాబయ్య, కొత్తింటి నర్సింలు, ఆర్గనైజర్స్ దుబ్బాక ఆశన్న, పాపనోళ్ళ బీరయ్య, మద్దెల భాగయ్య, కుమ్మరి రాజయ్య, పెసరి సాయిలు, నిమ్మన బోయిన బాలయ్య, మరికంటి దాకయ్య, పోసాని బైరు, వడ్ల మురళి,పోలబోయిన నరేష్, చిందం భూమయ్య, నిగర బోయిన అన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షునికి సన్మానం



**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 21 (జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ దేశాయ్ ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సర్వగల్ల రవీందర్ ఆధ్వర్యంలో జాంబవంత మాదిగ దండోరా సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి సందర్భంగా బంగారం (జమ్మి ఆకులు) లను అందజేసి దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన రవీందర్ కు విజయ్ దేశాయ్ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో పెద్ద పదవులను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.

# ఎడపల్లి సహకార సంఘ సభ్యులకు సన్మానం



**ఎడపల్లి, అక్టోబర్ 21 ( జనంసాక్షి ) :** ఎడపల్లి సహకార సంఘం చైర్మన్, సభ్యులను బుధవారం సహకార సంఘం కార్యదర్శి రాజారామ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు 2020లో పదవి బాధ్యత చేపట్టిన నూతన కమిటీ నేటి వరకు కొనసాగింది. ఈ మేరకు సహకార సంఘం చైర్మన్ పోల మాల్కారెడ్డి, వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి, సహకార సంఘం సభ్యులు బర్దిపూర్ ప్రవీణ్, రాములు, ఎం సురేష్, పరశురాం గౌడ్, నగేష్ గౌడ్, పరిగ్గట సుమన్, కమలాకర్ రెడ్డిలతో పాటు సహకార సంఘం కార్యదర్శి రాజారాం, సిబ్బందిలను సైతం ఘనంగా సన్మానించారు.

## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దంపతుల పరామర్శ



**మంథని, అక్టోబర్ 21, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం అక్కేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మబ్బు ఒదమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బుధవారం ఆమెను వారి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి తోటి మిత్రుల ఆర్థిక సహాయం



**వీణవంక అక్టోబర్ 21(జనం సాక్షి)** వీణవంక మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఉడుత సునీల్ 01-07-2026 రోజున మృతి చెందడంతో,మృతి చెందిన సునీల్ కు ముగ్గురు కూతుళ్ళకి,కుటుంబానికి అండగా నిలిచేందుకు పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో కలిసి చదువుకున్న మిత్రులతో పాటు సోషల్ మీడియా ద్వారా మానవతా దృక్పథంతో స్పందించిన దాతలందరూ కలిసి రూ.1,86,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.కష్టకాలంలో తమ మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి, స్నేహబంధం విలువను చాటుకున్నారు.స్నేహం అంటే కలిసి చదువుకోవడం,కలిసి తిరగడం మాత్రమే కాదని,ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన స్నేహమని నిరూపించారు. సోషల్ మీడియా,వాట్సాప్ స్టేటస్, ద్వారా స్పందించి పెద్ద మనస్సుతో సహాయ సహకారాలు అందించి మిత్రుడి కుంటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు.

### వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

## అనంతుల రాజుకు ఘన సన్మానం

### రామగిరి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అభినందనలు



**రామగిరి జనం సాక్షి అక్టోబర్ 21 :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన అనంతుల రాజును బుధవారం సెంటినరీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రామగిరి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నలమాచు ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల శ్రీనివాస్‌తో పాటు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా శ్రీనివాస్ ఆయనకు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో అనంతుల రాజు సేవలను గుర్తించి వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల గుండా శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని, అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రావికంటి గుండయ్య, ఎల్లంకి వంశీకృష్ణ, కొమురవెల్లి విజయ్ కుమార్, కొత్త శ్రీనివాస్, రావికంటి సతీష్ కుమార్, కురిమిళ్ల సుధాకర్, గుండ రాధయ్య, దొంతుల సురేష్, గుండా శంకరయ్య, కేశెట్టి శ్రీనివాస్, తోట ప్రసాద్, కొమురవెల్లి వెంకటరమణ, కొత్త కమలాకర్, కేశెట్టి వేణు, తోట శ్రీనివాస్, మల్యాల శ్రీశైలం, గుండ కుమార్, చిట్టిమల్ల వెంకటరమణ, కాపర్తి అభిలాష్, దొంతుల మణికంఠ, దొంతుల మారుతి, రావికంటి అరవింద్, గుండ హరీష్, గుండ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ మార్కెట్ కమిటీ పీఠం సుభాష్ జాదవ్‌కేనా?

- చైర్మన్ పదవిపై దాదాపు స్పష్టత
- ఎరుకల వర్గానికి అవకాశం కల్పించే దిశగా కాంగ్రెస్ అడుగులు




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21(జనం సాక్షి):** నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంపై జిల్లా రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఎస్టీ జనరల్ కేటగిరీకి కేటాయించిన ఈ పదవికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త సుభాష్ జాదవ్ పేరు బలంగా వినిపిస్తోంది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయనకే అవకాశం దక్కవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, పార్టీ వర్గాల్లో మాత్రం జాదవ్ అభ్యర్థిత్వంపై ఆశాభావం పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

### చైర్మన్ పీఠంపై జాదవ్‌కే మొగ్గు?

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సంబంధించి సాగుతున్న అంతర్గత చర్చల్లో సుభాష్ జాదవ్ పేరు ప్రాధాన్యం సంతరించుకున్నట్లు సమాచారం. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసిన ఆయనకు అవకాశం కల్పించాలనే అభిప్రాయం కొందరు నాయకుల్లో బలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో చైర్మన్ పదవి ఆయనకు దాదాపు ఖరారైనట్టేననే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

### ఎరుకల సామాజిక వర్గానికి రాజకీయ గుర్తింపు?

ఎస్టీ జనరల్ కేటగిరీలో ఉన్న ఈ పదవిని ఎరుకల సామాజిక వర్గానికి కేటాయించాలనే డిమాండ్ కొంతకాలంగా వినిపిస్తోంది. జిల్లాలో ఈ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సుభాష్ జాదవ్‌కు అవకాశం లభిస్తే, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తకు గుర్తింపు ఇవ్వడంతో పాటు సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చినట్లవుతుందని ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు.

### నలుగురి ఆశలు.. జాదవ్‌కు అనుకూలంగా సమీకరణాలు?

చైర్మన్ పదవిని ఆశిస్తున్న నలుగురు నేతలు తమవంతు ప్రయత్నాలు సాగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ పెద్దల మద్దతు పొందేందుకు వివిధ స్థాయుల్లో సంప్రదింపులు జరిగినట్లు సమాచారం. అయితే, సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌తో అనుబంధం కొనసాగించడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వంటి అంశాలు సుభాష్ జాదవ్‌కు అనుకూలంగా మారవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

### కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన సేవకు ఫలితం?

రాజకీయ పదవుల కేటాయింపులో పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలనే వాదన బలంగా వినిపిస్తోంది. పార్టీకి అవసరమైన సమయంలో అండగా నిలిచిన వారిని గుర్తించడం ద్వారా కేడర్‌లో నూతన ఉత్సాహం నింపవచ్చని నాయకులు భావిస్తున్నారు. ఈ కోణంలో సుభాష్ జాదవ్‌కు అవకాశం కల్పించవచ్చనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది.

### రైతాంగ సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడికి బాధ్యతలు

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రైతులు, వ్యాపారులు, హమాలీలు, వ్యవసాయ రంగంపై ఆధారపడిన వర్గాలకు కీలకమైనది. మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేసే నాయకుడు ఈ బాధ్యతలు చేపట్టాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయి అనుభవం, ప్రజలతో అనుబంధం, పార్టీ కార్యకర్తలతో సమన్వయం వంటి అంశాలు నియామకంలో ప్రాధాన్యం పొందవచ్చని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### అధికారిక ప్రకటనపైనే తుది ఉత్కంఠ

మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. సుభాష్ జాదవ్ పేరు బలంగా వినిపిస్తుండటంతో ఆయన మద్దతుదారుల్లో ఆశలు పెరిగాయి. అయితే, నియామకానికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే తుది నిర్ణయంపై స్పష్టత రానుంది. ఎరుకల సామాజిక వర్గానికి ఈసారి అవకాశం దక్కుతుందా? సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందించిన సుభాష్ జాదవ్ మార్కెట్ కమిటీ పీఠాన్ని అధిరోహిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# 11 కోట్లతో డబుల్ రోడ్డు పూర్తవుతుందా?

### బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఫైర్

### డబుల్ రోడ్డు విషయంలో ఎమ్మెల్యే నిర్లక్ష్యం - అఖిలపక్ష పోరాటం తప్పదు



**గన్నేరువరం, అక్టోబర్ 21 (జనంసాక్షి):** గునుకుల కొండాపూర్ నుండి పొత్తూరు వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణం అధికార పార్టీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంప వెంకన్న తీవ్రంగా విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే మూడు నెలల్లో డబుల్ రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మూడేళ్లు గడిచినా ఒక్క అడుగు ముందుకు వేయలేదని ఆరోపించారు. కాంట్రాక్టర్ కు గతంలో చేసిన పనులకు రావాల్సిన 11 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించి, దానినే కొత్త నిధుల మంజూరుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నిధుల మంజూరు పేరుతో కాంట్రాక్టర్‌తో కలిసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. గునుకుల కొండాపూర్ నుండి జంగపల్లి వరకు కేవలం కంకర పోసి వదిలేసి, తారు రోడ్డు వేసినట్లు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. జంగపల్లి వరకే కాదు, పూర్తిగా పొత్తూరు వరకు డబుల్ రోడ్డు మరియు కల్వర్టుల నిర్మాణానికి అవసరమైన 72 కోట్ల రూపాయల నిధులను పూర్తిగా మంజూరు చేయించి రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ 11 కోట్ల బకాయిలు మంజూరు కావడానికి యువజన సంఘాలు, అఖిలపక్షం చేసిన నిరంతర పోరాటమే కారణమని స్పష్టం చేశారు. డబుల్ రోడ్డు పనులు పూర్తయ్యే వరకు తమ పోరాటం ఆగదని, అవసరమైతే యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ నాయకులు న్యాత సుధాకర్, గొల్లపల్లి రవి, కొట్టే భూమయ్య, మీసాల ప్రభాకర్, అటికం రవిగౌడ్, సమ్మెట అనిల్, బూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# పంట కాపాడుకోవడానికి రైతు పడరాని తిప్పలు

**కంది పంటకు ట్యాంకర్ తో నీరు పడుతున్న రైతు**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 (జనంసాక్షి):** ఆరు కాలం కష్టపడి పంటలు పండించిన పంట ను కాపాడుకునేందుకు వరుణ దేవుడు కరుణించకపోతే చివరికి చేతికి వచ్చిన పంట చేజారి పోతుందని ఖర్చు కోసం ఏమాత్రం వెనకడుగు వేయకుండా వాటర్ ట్యాంకర్ తో కంది పంటకు నీరు పెట్టే దీనస్థితిలో అన్నదాత పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే కామారెడ్డి జిల్లా మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో కొమ్మిరెడ్డి చిన్న ఆంజనేయులు తనకున్న మూడున్నర ఎకరాల కంది పంట వేయడం జరిగింది. అయితే పూత దశకు వచ్చి ఇంకా ఒక జల్లు వర్షం కురిస్తే పూర్తిస్థాయిలో కంది పంట చేతికి వస్తుంది. కాకపోతే వర్షాలు పడవని చేతికొచ్చే పంట చేజారి పోతుందని దిగులుతో కంది పంటకు వాటర్ ట్యాంకర్ తో నీళ్లు పట్టడం జరిగింది. దీంతో మళ్లీ కంది పంట పూర్తి కాయలు కాసి తన భూమిలో వేసిన ఈ పంటకు ఈ ఏటా గట్టెక్కచెని ఇవి వినూత్న ప్రయత్నం చేశాడు. ఏదేమైనా వర్షాలు లేక రైతన్నలు చాలా ఇబ్బందులు పడుతుంటే ఇంకోవైపు బోర్లు ఉన్న దగ్గర మోటార్లకు సరిపడా విద్యుత్ సరఫరా లేకుండా చేయడంతో రైతన్నలు పంటలు పండించాలంటే జంకే పరిస్థితి నెలకొంది.

# శమీ పూజలో మంథని మాజీ ఎమ్మెల్యే దంపతులు



**మంథని, అక్టోబర్ 21, (జనంసాక్షి) :** విజయాలనిచ్చే విజయదశమి దసరా సందర్భంగా మంగళవారం సాయంత్రం వేదపండితులు నిర్వహించిన శమీ పూజలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్-శైలజ దంపతులు హజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండవులకు ఆశ్రయం ఇవ్వడంతో పాటు శ్రీరాముడి విజయానికి జమ్మి చెట్టు ప్రతీకగా నిలుస్తుందని, ఈ క్రమంలో విజయదశమి రోజున జమ్మి చెట్టును పూజించడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథని కోర్టు సమీపంలోని జమ్మి చెట్టును దర్శించుకున్న ఆయన పట్టణ ప్రజలకు దసరా శుబాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరికి విజయాన్ని చేకూర్చాలని వేడుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం పట్టణ ప్రజలు, అభిమానులు ఆయనకు శమీ ఆకులు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు

# దళిత యువకుడు పై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మంత్రి శ్రీధర్ బాబు చొరవ తీసుకోవాలి**

**ఇరుగురాల భాగ్యలక్ష్మి డిమాండ్**



**మంథని, అక్టోబర్, 21, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన దళిత యువకుడు అగ్గిమల్ల అనిల్‌పై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఎంసీ సభ్యురాలు, ఉమెన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ ఇరుగురాళ్ల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పని నిమిత్తం రొంపికుంటకు వెళ్లిన అగ్గిమల్ల అనిల్‌పై మాడిశెట్టి ఆదిత్య, సింధం సాయి ప్రణీత్ తో పాటు మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆరోపించారు. దళితులపై వివక్ష చూపడం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. దళితుల హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దళిత సంఘాలను ఏకతాటిపైకి తీసుకువస్తుంటే, మరోవైపు కుల వివక్షతో దళితులను చిన్నచూపు చూడడం బాధాకరమని పేర్కొన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

**దాడిపై సమగ్ర విచారణ జరపాలి**

అనిల్ పై దాడి ఘటనకు సంబంధించి దళిత గ్రామస్తులు కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని, హత్యాయత్నం కేసు నమోదు చేసే అధికారం తమకు లేదని ఎస్ఐ చెప్పినట్లు బాధితుల తరఫున వారు పేర్కొన్నారు. అయితే, ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సమగ్ర విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ విషయంలో చొరవ తీసుకుని బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. బాధితుడికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చిప్పకుర్తి ఓదెలు, అగ్గిమల్ల నరసయ్య, నల్లాల మల్లేష్, నల్లాల లక్ష్మి, అగ్గిమల్ల సరోజన, చట్ల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మిపూజలో ప్రభుత్వ విప్ విజయ రమణారావు



**పెద్దపల్లి,అక్టోబర్ 21(జనంసాక్షి) :** విజయదశమి రోజున పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జమ్మి పూజ,రావణ దహన కార్యక్రమంలో ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పండితులు కొండపాక శ్రీనివాస్ వేద మంత్రోచ్చాల మధ్య జమ్మి పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ ప్రజలు, నియోజకవర్గ ప్రజలకు, యావత్ తెలంగాణ ప్రజలకు అందరికీ దసరా శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రం పాడిపంటలతో పచ్చగా ఉండాలని,ప్రజలంతా సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్,ఏసిపి జి కృష్ణ,సిఐ కే ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్,ఎస్ ఐ లు,పెద్దపల్లి పట్టణ వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల్లో భాకం సాయి కిరణ్ మార్క్!

**- ప్రభుత్వ విప్ కటౌట్ ఏర్పాటు!!!**

**- ఎక్కడ చూసినా బాకం సాయికిరణ్ ప్లెక్సీలు!!!**

**- ఎదుగుతున్న యువ నేత సాయికిరణ్ యాదవ్!!!**

**సుల్తానాబాద్,అక్టోబర్ 21(జనంసాక్షి) :** దసరా బతుకమ్మ ఉత్సవాల్లో మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ మార్కు స్పష్టంగా కనిపించింది.ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు కటౌట్లు ఏర్పాటు చేసి ఆకర్షణగా నిలిచారు. బతుకమ్మ ఉత్సవాల్లో కటౌట్లు ఏర్పాటు చేశారు.ఇటీవల నిర్వహించిన సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలతో సంచలనం సృష్టించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎటు చూసినా భాగం సాయికిరణ్ యాదవ్ ప్లెక్సీలే దర్శనమిచ్చాయి. అంతేకాకుండా జూనియర్ కళాశాల సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించి యువతకు ప్రేరేపణ గా నిలిచారు.సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నది అతిశయోక్తి లేదు. తన వార్డులో ప్రజలకు ఏ అవసరం ఉన్న నేనున్నానంటూ



భరోసాగా పెద్దన్నగా ఉంటున్న భాకం సాయికిరణ్ యాదవ్ రానున్న రోజులలో ఉన్నత పదవులను అధిరోహించాలని ప్రజలకు సేవ చేయాలని పలువురు కోరుతున్నారు.



# భక్తిశ్రద్ధలతో మంథనిలో దుర్గాదేవి నిమజ్జనం

**భక్తి పాటలు, జయజయధ్వానాల మధ్య వీడ్కోలు పలికిన భక్తజనం**

**మంథని, అక్టోబర్ 21( జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గామాతకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. అమ్మవారి నామస్మరణ, భక్తి గీతాలు, జయజయధ్వానాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నవరాత్రుల తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో దర్శించుకుని పూజలు నిర్వహించిన భక్తులు, నిమజ్జన వేడుకలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. దుర్గామాతకు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

# దుబాయిలో రోడ్డు ప్రమాదం

**- మల్లారెడ్డిపేట వాసి వంశీ మృతి**

**- మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చూడాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి**



**గంభీరావుపేట(జనంసాక్షి):** గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కుర్ర వంశీ (22)దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వంశీ మృతి వార్తతో స్వగ్రామంలో విషాదం నెలకొంది.దుబాయిలో ఉన్న అతని స్నేహితుల ద్వారా కు టుంబ సభ్యులకు ఈ సమా చారం అందినట్లు తెలిసిం ది. వంశీ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేం దుకు సంబంధిత అధికా రులు, ప్రభుత్వం సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుని, అవసరమైన సహాయం అందించాలని కోరారు.

# కొమురవెల్లి భాస్కర్ కు స్కూటీ బహుమతి



**సుల్తానాబాద్,అక్టోబర్ 21(జనంసాక్షి) :** దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, ఆర్యవైశ్య సంఘం వాసవీమాత దేవాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రాలో బుధవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్ కి బంపర్ బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటీ బహుమతిగా లక్కీ డ్రా లో లభించింది. ఎంతో సంతోషకరమని కొమురవెల్లి భాస్కర్ ఆనందం వ్యక్తం చేశారు.